మహారాష్ట్రలో చెరుకు సాగు, చక్కెర ఫ్యాక్టరీల నిర్వహణపై స్టడీ టూర్

పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

శ్రీదత్తా సహకార చక్కెర ఫ్యాక్టరీని అధికారులు, రైతులతో కలిసి పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, బోధన్ శాసనసభ్యుడు సుదర్శన్‌రెడ్డి తదితరులు

బోధన్, మార్చి 16: మహారాష్ట్రలో చెరుకు సాగులో అధిక దిగుబడుల సాధన, అక్కడి చక్కెర ఫ్యాక్టరీల నిర్వహణపై తీరుపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శని, ఆదివారాల్లో రెండు రోజుల స్టడీటూర్‌ను ఏర్పాటుచేసింది. బోధన్‌లోని నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా అక్కడి చెరుకు పంటలో వస్తున్న అధిక దిగుబడులను, చక్కెర ఫ్యాక్టరీలను లాభదాయకంగా నడుపుతున్న తీరును పరిశీలించేందుకు ఈ స్టడీ టూర్‌ను ఏర్పాటుచేసినట్లు అధికారులు తెలిపారు. మహారాష్ట్రలో లాభదాయకంగా నడపబడుతున్న కొల్హాపూర్ జిల్లా శిరోల్ తాలూకాలోని శ్రీ దత్తా సహకార చక్కెర ఫ్యాక్టరీని సందర్శించారు. ఫ్యాక్టరీ నిర్వహణ తీరును, ఫ్యాక్టరీ అధిక చక్కెర రికవరీ శాతం సాధిస్తున్న వైనాన్ని అధ్యయనం చేశారు. ఫ్యాక్టరీ పరిధిలోని చెరుకు తోటలకు వెళ్లి అక్కడ రైతులు అధిక దిగుబడులు సాధిస్తున్న తీరును పరిశీలించారు. రెండో రోజు స్టడీ టూర్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పాల్గొన్నారు. ఫ్యాక్టరీ చైర్మన్ గణపతిరావు పాటిల్ తాము తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలన్న చిత్తశుద్ధితో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నదన్నారు. పరిశ్రమలశాఖ డైరెక్టర్ మన్సూర్, రుద్రూర్ కృషి విజ్ఞాన్ కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ అంజయ్య, జిల్లా సాయిల్ టెస్టింగ్ ల్యాబొరేటరీ ఏవో లక్ష్మీకాంత్ రెడ్డి, రుద్రూర్ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు రాకేశ్, జిల్లా మైక్రో ఇరిగేషన్ ఇంజినీర్ మల్లయ్య, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి బండారి శ్రీనివాస్, డిప్యూటీ కేన్ కమిషన్ నర్సిరెడ్డి, బోధన్ అసిస్టెంట్ కేన్ కమిషనర్ సీహెచ్ వెంకట రవి తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు బోధన్ డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి వెళ్లిన 44 మంది రైతులు ఈ స్టడీ టూర్‌లో ఉన్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- సదుపాయాలు లేక ఇబ్బందులు
- కేంద్రంలో ఏడాదిలో రెండు సార్లు పాము కలకలం

ఒడ్డెర కాలనీలో అద్దెభవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

పోతంగల్, మార్చి 16 : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు చాలీచాలని అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. సరైన సదుపాయాలు లేకపోవడంతో నిర్వాహకులతోపాటు చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. మండలకేంద్రంలోని ఒడ్డెర కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతున్నది. ఆ భవనం పరిసరాలు అడవిని తలపించేలా ఉన్నాయి. ఈ భవనానికి డోర్లు, కిటికీలు కూడా లేకపోవడంతో విష పురుగులు, కీటకాలు కేంద్రంలోకి వస్తున్నాయి.

ఈనెల 11న అంగన్‌వాడీ కేంద్రంలోకి పాము రావడంతో టీచర్‌తోపాటు చిన్నారులు భయాందోళనకు గురయ్యారు. కేకలు వేస్తూ బయటికి పరుగులు తీశారు. పాములు పట్టేవారు వచ్చి పామును పట్టుకున్నారు. ఏడాదిలో రెండుసార్లు పాము కేంద్రంలోకి వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద రాత్రి సమయంలో ఆకతాయిలు మద్యం తాగుతున్నారని, ఉదయం వచ్చేసరికి మద్యం సీసాలు, గ్లాసులు దర్శనమిస్తున్నాయని వాపోయారు. 2008 సంవత్సరం నుంచి కేంద్రం అద్దె భవనంలో కొనసాగుతున్నట్లు వివరించారు. ఈ కేంద్రానికి నూతన భవనం మంజూరైనా మూడేండ్లుగా పనులు కొనసాగుతున్నాయి. భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి అందించాలని కోరుతున్నారు. మండలకేంద్రంలోని మైనార్టీ కాలనీలో అద్దె భవనంలో మరో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతున్నది. కేంద్రానికి స్థలం కేటాయించడంతోపాటు నూతన భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలోకి వచ్చిన పాము

కేంద్రంలోకి తరచూ కీటకాలు వస్తున్నాయి

అంగన్‌వాడీ సెంటర్‌కు డోర్లు, కిటికీలు సరిగ్గా లేకపోవడంతో తరచూ పాములు, కీటకాలు, ఎలుకలు వస్తున్నాయి. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ప్రైమరీ స్కూల్ పక్కన అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. త్వరగా పూర్తిచేసి భవనాన్ని అందజేయాలి.

- జ్యోతి, అంగన్‌వాడీ టీచర్

క్వింటాలు పసుపునకు రూ. 15 వేలు చెల్లించాలి

- ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య

మాట్లాడుతున్న వేల్పూర్ భూమయ్య

డిచ్‌పల్లి, మార్చి 16 : జిల్లాలో పసుపు రైతులు మార్కెట్లో అమ్ముకుందామంటే 15 రోజులుగా తగిన ధర రాక ఆందోళన చెందుతున్నారని, క్వింటాలు పసుపునకు రూ. 15 వేలు చెల్లించి కొనుగోలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్కెట్‌లో దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను తగ్గించి, రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రాక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు మోసాలకు గురికాకుండా చూడడంతో అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు. వరి ధాన్యం మాదిరిగానే క్వింటాలు పసుపునకు రూ.1000 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని, నిజామాబాద్‌లోని చక్కెర ఫ్యాక్టరీలను ప్రభుత్వమే తెరిపించి నడిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవస్వామి, గంగాధర్, సాయిలు పాల్గొన్నారు.

నకిలీ ధ్రువపత్రాల తయారీ కేసులో నలుగురి రిమాండ్

బీబీపేట్, (దోమకొండ) మార్చి 16: నకిలీ ధ్రువపత్రాల తయారీ కేసులో నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై స్రవంతి తెలిపారు. దోమకొండ గ్రామ పంచాయతీ పేరిట నకిలీ స్టాంపులు, నకిలీ మనీ వాల్యూ ట్యాక్స్ రశీదులు తయారీచేసి, పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసిన దోమకొండకు చెందిన చింతల రవీందర్, మంగళపల్లి శ్రావణ్‌పై పోలీస్ స్టేషన్‌లో పంచాయతీ కార్యదర్శి యాదగిరి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసిన పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టగా మరో ఇద్దరు పేర్లు బయటపడ్డాయి. దోమకొండకు చెందిన మన్నే శ్యామ్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని పంచాయతీ కార్యదర్శి పేరిట తయారుచేసిన నకిలీ స్టాంపు, రౌండ్ సీల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరికి నకిలీ స్టాంపులను తయారుచేసి ఇచ్చిన కామారెడ్డికి చెందిన దొంతుల కృష్ణ (శ్రీ కృష్ణ రబ్బర్ స్టాంప్ షాపు నిర్వాహకుడు)ను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితులు చింతల రవీందర్‌ను ఏ-1, మన్నే శ్యామ్‌రెడ్డి ఏ-2, మంగళపల్లి శ్రావణ్‌ఏ-3, దొంతుల కృష్ణ ఏ-4 అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సైకిల్‌ను ఢీకొట్టి కారు బోల్తా

- బాలుడికి తీవ్రగాయాలు
- కారులో ఉన్న ఐదుగురికి స్వల్పగాయాలు

బోల్తాపడిన కారు

వినాయక్‌నగర్, మార్చి 16 : సైకిల్‌పై వెళ్తున్న బాలుడిని ఢీకొట్టిన కారు బోల్తాపడిన ఘటనలో బాలుడు తీవ్రగాయాలపాలైన ఘటన ఆదివారం ఉదయం జిల్లాకేంద్రంలో చోటుచేసుకున్నది. త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని చంద్రశేఖర్ కాలనీ-పోలీస్ కాలనీ రోడ్డు నంబర్-2కు చెందిన సయ్యద్ షెహజాద్ (11) సైకిల్‌పై వెళ్తున్నాడు. కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో జీజీ కళాశాల వద్ద హైదరాబాద్ నుంచి నిర్మల్ జిల్లా బాసర పుణ్యక్షేత్రానికి వెళ్తున్న కారు బాలుడిని ఢీకొట్టి, కారు బోల్తా పడింది. గమనించిన స్థానికులు తీవ్రగాయాలపాలైన బాలుడిని చికిత్స కోసం దవాఖానకు తరలించారు. బోల్తాపడిన కారులో ఉన్న ఐదురుగు ప్రయాణికులను బయటికి తీశారు. స్వల్ప గాయాలైన వారిని సైతం చికిత్స కోసం దవాఖానకు తరలించారు. ఎస్సై హరిబాబు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. బాలుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కారు నడుపుతున్న హైదరాబాద్‌లోని ప్రగతినగర్‌కు చెందిన నాగకిశోర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సెల్ టవర్ ఏర్పాటును అడ్డుకున్న స్థానికులు

తాత్కాలికంగా పనులు నిలిపివేత

వినాయక్‌నగర్, మార్చి 16 : జిల్లాకేంద్రంలోని పెద్దబజార్ చౌరస్తాలో ఓ భవనంపై ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్ పనులను స్థానికులు ఆదివారం ఉదయం అడ్డుకున్నారు. భవనంపై సెల్‌టవర్ ఏర్పాటును విరమించుకోవాలని కాలనీవాసులు ఇంటి యజమానితో వాదనకు దిగారు. టవన్ ఏర్పాటు పనులను తాత్కాలికంగా నిలిపి వేయించడంతో స్థానికులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. బిల్డింగ్ యజమాని మధ్యాహ్నం మళ్లీ టవర్ ఏర్పాటు పనులను ప్రారంభించడంతో విషయం తెలుసుకున్న స్థానికులు ఘటనా అక్కడికి చేరుకుని, బిల్డింగ్ యజమానితో వాగ్వాదానికి దిగారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రెండో టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. టవర్ ఏర్పాటును నిలిపివేయించాలని మున్సిపల్ అధికారులకు సైతం ఫిర్యాదు చేయనున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రస్తుతం టవర్ ఏర్పాటు పనులను నిలిపివేశారు.

ఆటోలో తీసుకెళ్లి బంగారు, వెండి నగలు చోరీ

పోలీసులకు ఫిర్యాదుచేసిన బాధితురాలు

నిజాంసాగర్, మార్చి 16 : ఆటోలో తీసుకెళ్తానని ఓ మహిళ నుంచి దుండగుడు బంగారు, వెండి నగలు దోచుకెళ్లిన ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకున్నది. స్థానిక ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కల్హేర్ మండలం మారిడి గ్రామానికి చెందిన మ్యాతరి భూమవ్వ, తన కూతురు ఇంట్లో పూజ ఉన్నదని అచ్చంపేట గ్రామానికి వెళ్లడానికి నిజాంసాగర్ బస్టాండ్‌కు వచ్చింది. అచ్చంపేట వెళ్లడానికి ఆటో కోసం చూస్తుండగా ఓ ఆటో డ్రైవర్ వెంట ఉన్న ఓ మహిళ ఇద్దరు కలిసి భూమవ్వను అచ్చంపేటకు తీసుకెళ్లామని చెప్పారు. భూమవ్వను ఆటోలో ఎక్కించుకొని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి ఆమె వద్ద ఉన్న రెండు తులాల బంగారు నగలు, 20 తులాల వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. భూమవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలో దూకి యువకుడి ఆత్మహత్యాయత్నం

- అడ్డుకొని కౌన్సెలింగ్ నిర్వహించిన ఎస్సై

నవీపేట, మార్చి 16: కుటుంబ కలహాలతో ఓ యువకుడు గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన నవీపేట ఎస్సై వినయ్ అడ్డుకొని, అతడికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని శివాజీనగర్‌కు చెందిన బయ్యాన్ని వంశీకృష్ణ కుటుంబ కలహాలతో ఆదివారం నవీపేట మండలంలోని యంచ గోదావరిలో నదిలో దూకేందుకు యత్నించాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎస్సై వినయ్ గమనించి, ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్నాడు. వెంటనే పోలీసుస్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ నిర్వహించాడు. తల్లిదండ్రులను పిలిపించి, వారికి అప్పగించాడు.

'సన్' డే

- మార్చిలోనే మండుతున్న ఎండ

కోటగిరి, మార్చి 16 : రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతున్నది. మార్చిలోనే సూరీడు భగభగమంటున్నాడు. మధ్యాహ్నం వివిధ పనుల కోసం ప్రజలు రోడ్లపైకి రావాలంటే జంకుతున్నారు. కోటగిరి అంబేద్కర్ చౌరస్తా, కోటగిరి బస్టాండ్ ఎప్పుడు నిత్యం ప్రజలతో రద్దీగా ఉండేది. ఆదివారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో మధ్యాహ్నం జనాలు లేక రోడ్డంతా నిర్మానుష్యంగా మారింది.

కోటగిరి బస్టాండ్ వద్ద నిర్మానుష్యంగా రోడ్డు

ఇకపై అప్పులు చేయను!

- ఆదాయం పెంచి, పంచుతా
- అప్పు చేసి తినే పప్పు కూడుతో రాష్ట్రానికి ముప్పు
- అప్పుల వల్లే పథకాలు అమలు చేయలేకపోతున్నా
- స్టేషన్ ఘన్‌పూర్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే రికార్డుస్థాయిలో రూ.1.53 లక్షల కోట్లు అప్పులు చేసి, తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇకపై తాను అప్పులు చేయదలుచుకోలేదని స్టేషన్ ఘన్‌పూర్ సభ సాక్షిగా స్పష్టంచేశారు. అప్పుచేసి తినే పప్పు కూడు, అప్పు ఎప్పటికైనా రాష్ట్రానికి ముప్పేనని తాను స్పష్టంగా నిర్ణయించుకున్నట్టు వివరించారు. ఇకపై అప్పులు చేయబోనని, రాష్ట్ర ఆదాయం పెంచి, పేదలకు పంచుతానని పేర్కొన్నారు. అందరూ సహకరించాలని కోరారు.

2 లక్షల మాఫీ అందరికీ చేయలే...

రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించారు. గత ప్రభుత్వం అప్పులు చేయడం మూలంగా 15 నెలల పాలనలో రూ.1.53 లక్షల కోట్లు అసలు, మిత్తి చెల్లించామని ఆరోపించారు. ఆ మొత్తం నిధులు ఉంటే అర్హులైన 30 లక్షల మందికి రూ.5 లక్షల చొప్పున ఇచ్చి ఇండ్లను కట్టించేవాడినని స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆదివారం జరిగిన బహిరంగ సభలో సీఎం పేర్కొన్నారు. 75 లక్షల మంది రైతులకు రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేసేవాడినని చెప్పారు. తాజా అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంలో, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటల్లోనూ రూ.2 లక్షల రుణమాఫీ పూర్తయిందని స్పష్టం చేసిన విషయం విదితమే.

ఆర్థిక నిపుణుల విస్మయం

సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆర్థిక నిపుణులు, రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి నెలకు రూ.10 వేల కోట్ల చొప్పున, ఈ 15 నెలల్లో రూ.1.53 లక్షల కోట్లు అప్పులు చేయడమే కాకుండా నీతులు వల్లించడం ఏమిటని చెప్తున్నారు. ఎన్నికలకు ముందు అప్పులపై నానా యాగీ చేసి, నేడు అప్పుల కోసం వెంపర్లాడంపై విమర్శలు చేస్తున్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ హయాంలో తీసుకొచ్చిన అప్పులన్నీ అసలు, మిత్తిలకే కట్టామని అబద్ధాలు చెప్పడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గత బీఆర్ఎస్ సర్కారుపై అభాండాలు వేయడం సరికాదని హితవు పలుకుతున్నారు. ఆర్బీఐ డాటాను వారు గుర్తుచేస్తున్నారు.

ఈసారి రూ.లక్షన్నర కోట్ల అప్పు?

- ప్రభుత్వ బడ్జెట్ రుణాలు రూ.80 వేల కోట్లు
- రూ.40 వేల కోట్ల బడ్జెటేతర రుణాలు తీసుకునే ప్లాన్
- భూముల తనఖాతో 30 వేల కోట్లు సమీకరణకు ప్లాన్

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): 'మా ప్రభుత్వం ఇకపై అప్పులు చేయదలుచుకోలేదు' అని ఆదివారం వరంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినప్పటికీ అవన్నీ ఒట్టి మాటలేనని ఆర్థిక నిపుణులు కొట్టిపారేస్తున్నారు. సీఎం చేస్తున్న వ్యాఖ్యలకు, బడ్జెట్‌లో ప్రభుత్వ ప్రణాళికలకు సంబంధమే లేదని స్పష్టం చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు రూ.3.15 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే లీకులు ఇచ్చింది. ఇది నిరుటి బడ్జెట్ కంటే దాదాపు రూ.24 వేల కోట్లు ఎక్కువ. సాధారణంగా రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో సొంత పన్నులు, కేంద్ర పన్నుల్లో వాటా, పన్నేతర ఆదాయం బడ్జెట్‌లో ప్రధానాంశాలుగా ఉంటాయి. వీటితోపాటు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో తీసుకునే రుణాలను కలిపి రాష్ట్ర వార్షిక బడ్జెట్ అంచనాలను రూపొందిస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రుణాలు కాకుండా రెవెన్యూ రాబడులను రూ.2.21 లక్షల కోట్లుగా అంచనా వేశారు.

రూ.2 లక్షలలోపే బడ్జెట్ పెడతారా?

రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేయదలుచుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్న మాట నిజమే అయితే రెవెన్యూ రాబడుల ఆధారంగా మాత్రమే బడ్జెట్ రూపొందించాల్సి ఉంటుంది. ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో వచ్చే రుణాలను కూడా తీసుకోకూడదు. ఈ లెక్కన 2025-26 బడ్జెట్ రూ.2 లక్షల కోట్లలోపే ఉండాలి. భూముల తనఖా, విక్రయాల ద్వారా భారీగా నిధులను రాబట్టుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. రూ.30 వేల కోట్ల వరకు సమీకరించుకోబోతున్నట్టు సమాచారం.

ప్రగతి సభలో సీఎంకు నిరసనసెగ

- రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తుండగా ఫ్లెక్సీ ప్రదర్శించిన మహిళలు
- సాంస్కృతిక సారథి ఉద్యోగాలుఇవ్వాలని డిమాండ్
- ఫ్లెక్సీ చింపేసిన పోలీసులు
- స్టేషన్ ఘన్‌పూర్‌లో సభలో కడియంకు రేవంత్ మద్దతు
- కాంగ్రెస్ ఇన్‌చార్జి గైర్హాజరు
- సీఎం సభలో చిన్న పిల్లలతో ర్యాప్ సాంగ్ డ్యాన్సులు

స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సభలో ఫ్లెక్సీలతో నిరసన తెలుపుతున్న మహిళలు

వరంగల్, మార్చి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/జనగామ చౌరస్తా: 'ప్రజాపాలన - ప్రగతి బాట' పేరిట జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిరసన సెగ తలిగింది. మహిళా కళాకారులు తమ డిమాండ్ల సాధన కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా ఫ్లెక్సీ ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సాంస్కృతిక సారథిలో తమకు ఉద్యోగాలు ఇవ్వాలని గుర్తు చేశారు. ఆ ఫ్లెక్సీని చూసిన రేవంత్‌రెడ్డి అసహానానికి గురయ్యారు. ఫ్లెక్సీని చూశానని, ఇక దించాలని ఆదేశించారు. కళాకారులు కూర్చునేలోపు ఒక్కసారిగా పదుల సంఖ్యలో పోలీసులు వారిని చుట్టుముట్టారు. దీంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొన్నది. మహిళా కళాకారుల ఫోన్లు, ఫ్లెక్సీని పోలీసులు గుంజుకున్నారు. వారిని ఈడ్చుకుంటూ సభ నుంచి బయటికి తీసుకువెళ్లారు. కొందరు చంటి బిడ్డలతో రాగా.. ముఖ్యమంత్రి మెప్పు కోసం పోలీసులు వారితోనూ దురుసుగా ప్రవర్తించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తుచేసేందుకు ప్రయత్నిస్తే అమానుషంగా ప్రవర్తించారని కళాకారులు వాపోయారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తమకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అసలు కాంగ్రెస్ నేతల దూరం

బీఆర్ఎస్ తరఫున గెలిచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి మద్దతుగా రేవంత్‌రెడ్డి ఈ సభలో ప్రసంగించారు. స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలు కడియం శ్రీహరికి అండగా ఉండాలని కోరారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దవుతుందనే చర్చ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి విన్నపం ఉపఎన్నికలకు సంకేతమని సభకు వచ్చినవారు మాట్లాడుకున్నారు. ఈ సభకు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి సింగారపు ఇందిర హాజరు కాలేదు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్న పదేండ్లు పార్టీ కోసం పనిచేసిన ఆమె ఈ సభకు దూరంగా ఉండటంపై కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. కడియం శ్రీహరి వచ్చిన తర్వాత మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్నవారిని ఇబ్బంది పెడుతున్నారని ఇందిర ఇప్పటికే పీసీసీ, ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి పాల్గొన్న సభకు ఇందిర దూరంగా ఉండడంతో మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న ఓ వర్గం సైతం సభకు రాలేదు.

పిల్లలతో డ్యాన్సులు..

ఈ సభలో ముఖ్యమంత్రి స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే, సీనియర్ ఐఏఎస్‌లు, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో పాఠశాల పిల్లలతో స్టేజీపై ర్యాప్ సాంగ్‌లకు డ్యాన్సులు వేయించడంపై విమర్శలు వస్తున్నాయి. మొదట సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించగా.. ఆ తర్వాత ఎండలోనూ చిన్న పిల్లలతో నృత్యం చేయించడంతో సభకు హాజరైనవారు ఆశ్చర్యపోయారు. అనంతరం పిల్లలతో ఏకంగా ర్యాప్ సాంగ్‌లకు డ్యాన్సులు చేయించారు. దాదాపు పదేండ్లు విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రభుత్వ సభలో చిన్న పిల్లలతో ఇలాంటి డ్యాన్సులు వేయించడంపై సభకు వచ్చినవారు, ముఖ్యంగా మహిళలు పెదవి విరిచారు.

రేవంత్ అన్న..?

కాంగ్రెస్‌లో ఫిరాయించిన కడియం శ్రీహరి పరిస్థితి ఆయన సహజ వైఖరికి భిన్నంగా ఉన్నదని బహిరంగ సభకు వచ్చినవారు చర్చించుకున్నారు. కడియం శ్రీహరి ప్రసంగంలో ప్రతిసారి ముఖ్యమంత్రిని రేవంత్‌రెడ్డి అన్న అని సంబోధించారు. కడియం శ్రీహరి కంటే దాదాపు 17 ఏండ్లు చిన్న వయస్సు ఉన్న రేవంత్‌రెడ్డిని గతంలో ఎప్పుడూ లేని విధంగా అన్న, అన్న.. అని అనడం కొత్తగా ఉన్నదని... ఉప ఎన్నికలు వస్తాయనే ఆందోళనే దీనికి కారణమై ఉంటుందని సభకు వచ్చినవారు ముచ్చటించుకున్నారు.

గులాబీలతో ఇబ్బంది..

స్టేషన్ ఘన్‌పూర్ పర్యటనలో భాగంగా బహిరంగ సభకు ముందు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. వాటి నిర్వాహకులతో మాట్లాడారు. ప్రతి స్టాల్‌లోనూ నిర్వాహకులు ముఖ్యమంత్రికి ఆత్మీయంగా వారి ఉత్పత్తులతోపాటు గులాబీ పూలను ఇచ్చారు. దీంతో రేవంత్‌రెడ్డి కొంత అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ రంగు గులాబీ కావడంతో స్టాళ్లలో పూలు తీసుకోవడానికి ఆయన ఇబ్బంది పడినట్టు ఓ ఐఏఎస్ అధికారి పక్కనున్న వారితో అనడంతో అక్కడ ఉన్నవారు నవ్వుకున్నారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం: ఎమ్మెల్యే పల్లా

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా జనగామ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పాటు వివిధ పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన ప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం అప్రజాస్వామికమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ పిరికిపంద చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. అక్రమంగా అరెస్ట్ చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వమని గొప్పలు చెప్పుకొంటున్న కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత వస్తున్నదని, అసమర్థ పాలనపై ప్రశ్నిస్తారనే బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారని మండిపడ్డారు. సీఎం పర్యటన స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉంటే జనగామ నేతలను ఎందుకు అరెస్ట్ చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అక్రమ నిర్బంధాలతో నిరంకుశత్వాన్ని చాటుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హితవు పలికారు. ఈ మేరకు ఒక ప్రకటనలో పల్లా తెలిపారు. కాగా, జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టు



మాజీ డిప్యూటీ సీఎం రాజయ్యను గృహనిర్బంధం చేసిన పోలీసులు

సీఎం రేవంత్‌రెడ్డి జనగామ జిల్లా పర్యటన సందర్భంగా పోలీసులు ముందస్తుగా బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాజీ ఎమ్మెల్యే రాజయ్యను గృహ నిర్బంధంలో ఉంచారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో జిల్లాలో పంటలు ఎండిపోవడంతో సీఎం రేవంత్‌పై ఆగ్రహంగా ఉన్న రైతులు, నేతలు నిరసనలు తెలిపే అవకాశం ఉందన్న నిఘా వర్గాల సూచనల మేరకు శనివారం అర్ధరాత్రి నుంచి పోలీసులు అరెస్టులు మొదలుపెట్టారు. బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో పాటు బీజేపీ, సీపీఎం, టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేశారు. వారిని పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. సీఎం సభ ముగిసిన తర్వాత సాయంత్రం 4 గంటలకు విడిచిపెట్టారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు డిస్‌క్వాలిఫై అవుతారని, రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని మంత్రి రాజయ్య విమర్శించారు.

లక్షన్నర కోట్ల అప్పుతో ప్రజలకు ఒరిగిందేమిటి?

- కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపాటు

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందు ఎలాంటి ప్రణాళిక లేకుండా ఆరు గ్యారెంటీలను ప్రటించిన కాంగ్రెస్ పార్టీ.. వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే లక్షన్నర కోట్ల అప్పు చేసిందని దుయ్యబట్టారు. ఈ అప్పులతో ప్రజలకు ఒరిగిందేమిటి? రాష్ట్రంలో వచ్చిన మార్పు ఏమిటి? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓటమి నుంచి తప్పించుకునేందుకే తమిళనాడు సీఎం స్టాలిన్ రెండునెలలుగా వితండవాదం చేస్తున్నాడని విమర్శించారు.

రేవంత్.. ప్రజలే మీ బట్టలిప్పుతరు

- సీఎంపై ఏలేటి విమర్శలు



హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి జర్నలిస్టులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్‌రెడ్డికి బట్టలు ఊడదీసే ఫాంటసీ ఏంటో అర్థం కావడంలేదని చురకలంటించారు. అది చట్టసభలో ముఖ్యమంత్రి మాట్లాడే భాషేనా అని నిలదీశారు. "ప్రజలు మీ బట్టలు విప్పేందుకు రెడీ అయితున్నారు. ముందు దానిమీద దృష్టి పెట్టండి" అని హితవు పలికారు. బీజేఎల్పీ కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఏకపాత్రాభినయం చేస్తున్నారని విమర్శించారు. ఇది హామీల ఎగవేతల, సమాధానాల దాటవేతల ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. తాను గవర్నర్ ప్రసంగంపై ప్రశ్నిస్తే సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పకుండా దాటవేశారని, పసలేని జవాబులు చెప్పారని తీవ్రంగా మండిపడ్డారు.